నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, గురువారం 29 ఆగస్టు 2024 | SIDDIPET

గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా వేతనాలివ్వాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి

సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీవోఏలు

సిద్దిపేట, ఆగస్టు 28: గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా వేతనాలివ్వాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి డిమాండ్ చేశారు. ఐకేపీ వీవోఏలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలన్నారు. బుధవారం సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెర్ప్‌లో పనిచేస్తున్న ఐకేపీ వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రూ.5వేల గౌరవ వేతనం మాత్రమే ఇస్తున్నారని, రూ.26వేల వేతనంతో పాటు, 10లక్షల సాధారణ బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవికుమార్, తలపాక కిష్టయ్య, మహేశ్, ఎల్ల స్వామి, ఐకేపీ, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఐకేపీ వీవోఏలు

ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి

సీఐటీయూ ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ఐకేపీ వీవోఏల ధర్నా

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 28: ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఐకేపీ వీవోఏలకు కనీస వేతనం రూ. 26వేలు అమలు చేయాలని, గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా వేతనాలు ఇవ్వాలని, ఇతర పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు సాయిలు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.10 లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. సెర్ప్ నుంచి ఐడీ కార్డులు జారీ చేయాలని, గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతి నెలా వేతనాలను వీవోఏల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమచేయాలని, ఎస్‌హెచ్‌జీ, వీవోలైవ్ మీటింగ్స్ రద్దు చేయాలన్నారు. గ్రామ సంఘానికి ల్యాప్ టాప్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఐకేపీ వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. నగేశ్, కార్యదర్శి ముస్తాఫా, నాయకులు అనిత, భాగ్యలక్ష్మి, మాధవి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సమగ్రశిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు

ఉద్యోగ భద్రత కల్పించాలి

సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట టీఎస్ఎస్‌యూఎస్ ధర్నా

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 28: ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం (టీఎస్ఎస్‌యూఎస్) ఆధ్వర్యంలో నాయకులు, ఉద్యోగులు బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శేషాద్రి, ఉమాదేవి మాట్లాడుతూ సమగ్రశిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు ఉద్యోగికి జీవితబీమా రూ.10 లక్షలు, ఆరోగ్యబీమా రూ.6 లక్షలు కల్పించాలన్నారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని, 61 ఏండ్లు నిండిన ఉద్యోగులకు రూ.20 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. మృతి చెందిన కుటుంబాలకు రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. ధర్నాలో టీఎస్ఎస్‌యూఎస్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మెదక్ కలెక్టరేట్ ఎదుట దీక్ష చేస్తున్న సమగ్రశిక్షా ఉద్యోగులు

సీఎం రేవంత్ మాట నిలబెట్టుకోవాలి

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 28: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ సమగ్రశిక్షా రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఉద్యోగులు బుధవారం మెదక్ కలెక్టరేట్ ఎదుట ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సమగ్రశిక్షా జేఏసీ జిల్లా అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ గతేడాది సెప్టెంబర్‌లో వరంగల్‌లో సమగ్రశిక్షా ఉద్యోగులు సమ్మె చేస్తున్న సందర్భంగా పీసీసీ అధ్యక్షుడి హోదాలో హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రెగ్యులరైజ్ చేస్తామని, బేసిక్ పే అమలుచేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని లేనిచో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దీక్షలో సమగ్రశిక్షా ఉద్యోగులు రాజు, పాషా, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు శుభాకాంక్షల వెల్లువ

నర్సాపూర్, ఆగస్టు 28: ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు కావడంతో ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో బుధవారం మెదక్ జిల్లా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె వెంట రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మహబూబాబాద్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ తదితరులు ఉన్నారు.

జహీరాబాద్‌కు మహర్దశ..!

జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీ ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

- రూ.2361 కోట్లతో ఏర్పాటు కానున్న గ్రీన్‌ఫీల్డ్ ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీ
- 3245 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటుకు నిర్ణయం
- 1.74 లక్షల మందికి ఉపాధి అవకాశాలు
- ఫలించనున్న హైదరాబాద్-నాగపూర్ ఇండస్ట్రియల్ కారిడార్ కల
- స్మార్ట్‌సిటీ ఏర్పాటుపై సంగారెడ్డి జిల్లా ప్రజల హర్షం

సంగారెడ్డి, ఆగస్టు 28(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో పారిశ్రామిక రంగానికి మరింత ఊతమిచ్చేలా జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీని ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. జహీరాబాద్‌లో ఇది వరకే జాతీయ పారిశ్రామిక ఉత్పత్తి మండలి(నిమ్జ్) ఏర్పాటు కాగా, నిమ్జ్‌లో పరిశ్రమల స్థాపన ప్రారంభమైంది. హైదరాబాద్-నాగ్‌పూర్ ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటులో భాగంగా జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీ ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదముద్ర వేసింది. రూ.2361 కోట్లతో 3,245 ఎకరాల్లో దీనిని ఏర్పాటు చేయనున్నది. తద్వారా 1.74 లక్షల మందికి ప్రత్యక్షంగా, మరో లక్ష మందికిపైగా పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని, రూ.10వేల కోట్ల పెట్టుబడులు తరలివస్తాయని కేంద్ర ప్రభుత్వం అంచనా వేస్తున్నది. అంతర్జాతీయ ప్రమాణాలు, అన్ని మౌలిక వసతులతో దీనిని ఏర్పాటు చేస్తామని తెలిపింది. ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టు పూర్తయితే ఇందులో ఆటోమొబైల్, ఎలక్ట్రికల్, మెషినరీ, మెటల్స్, నాన్‌మెటాలిక్ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. ఫుడ్‌ప్రాసెసింగ్, రవాణా రంగానికి సంబంధించిన పరిశ్రమలు ఏర్పాటు అవుతాయి. పరిశ్రమల ఏర్పాటుతో స్థానికులకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు యాన్సిలరీ యూనిట్స్ ఏర్పాటుకు అవకాశాలు ఉంటాయి. హైదరాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి జహీరాబాద్ 120 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. జహీరాబాద్‌లో ఏర్పాటు చేసే స్మార్ట్‌సిటీ హైదరాబాద్‌కు 65 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. 65వ నెంబరు జాతీయ రహదారికి రెండు కిలోమీటర్ల దూరం, ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డుకు 40 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. జహీరాబాద్ రైల్వేలైన్ 19 కిలోమీటర్లు, మెటల్‌కుంట రైల్వేస్టేషన్ 12 కిలోమీటర్ల దూరంలో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ఏర్పాటు కానున్నది. పరిశ్రమలకు అవసరమైన గ్యాస్ పైప్‌లైన్ సైతం 30కిలోమీటర్ల దూరంలో అందుబాటులో ఉంది. నిమ్జ్ సమీపంలోనే ప్రభుత్వం ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ఏర్పాటు చేయనున్న పక్షంలో భూసేకరణ సులభతరం కానుంది. నిమ్జ్ కోసం ప్రభుత్వం జహీరాబాద్, న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల్లోని 17 గ్రామాల్లో 3వేల ఎకరాలకుపైగా భూమి సేకరించింది. నిమ్జ్‌లోనే ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ఏర్పాటు చేసిన పక్షంలో భూసేకరణ, పర్యావరణ అనుమతులు సమస్య తొలగనున్నది. అలా కాకుండా ప్రత్యేకంగా ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ఏర్పాటు చేసిన పక్షంలో జహీరాబాద్, న్యాల్‌కల్ మండలాల్లో అదనంగా భూసేకరణ చేపట్టాల్సి ఉంటుంది.

పారిశ్రామిక రంగం, ఉపాధికి ఊతం

జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ఏర్పాటుతో సంగారెడ్డి జిల్లాతోపాటు జహీరాబాద్‌లో పారిశ్రామిక రంగానికి ఊతం లభించనున్నది. సంగారెడ్డి జిల్లాలో ఇది వరకే పటాన్‌చెరు, సంగారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గాల్లో పెద్దసంఖ్యలో పరిశ్రమలు ఉన్నాయి. జహీరాబాద్ నియోజకవర్గంలో మహీంద్రాతోపాటు ఆటోమొబైల్ పరిశ్రమలు ఉన్నాయి. నిమ్జ్‌లో భాగంగా మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ఏర్పాటుకు ప్రకటన చేయడంతో ఈ ప్రాంతానికి మరిన్ని కొత్త పరిశ్రమలు తరలిరానున్నాయి.

సంగారెడ్డి జిల్లా వడ్డి జీపీలో గెజిట్ నోటిఫికేషన్ అంటిస్తున్న అధికారులు

ఫార్మాసిటీ కోసం గెజిట్ నోటిఫికేషన్ జారీ

న్యాల్‌కల్, ఆగస్టు 28: సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని డప్పూర్, వడ్డి, మల్గి గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న ఫార్మాసిటీ గెజిట్ నోటిఫికేషన్‌ను సంబంధిత అధికారులు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ఆయా గ్రామాల పంచాయతీ కార్యాలయాల్లో నోటిఫికేషన్ పత్రాలను అంటించారు. ఫార్మాసిటీ కోసం సేకరించే 2003 ఎకరాల ప్రభుత్వ, పట్టా భూములకు సంబంధించిన సర్వే నంబర్లను గెజిట్ నోటిఫికేషన్‌లో పొందుపర్చారు. ఇప్పటికే డప్పూర్ గ్రామ శివారులో 1465.25 ఎకరాలు, మల్గిలో 282.13 ఎకరాలు, వడ్డిలో 256 ఎకరాల ప్రభుత్వ, పట్టా భూముల సర్వే చేపట్టి నివేదికలను సర్కారుకు పంపించారు. ఫార్మాసిటీ కోసం బలవంతంగా భూ సేకరణ చేస్తే సహించేది లేదని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు అంటున్నారు. ప్రభుత్వం భూసేకరణ నిలిపివేయాలని, లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు.

సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సమగ్రశిక్షా ఉద్యోగులు

సమగ్రశిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 28: సమగ్ర శిక్షా ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేస్తూ వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘంజిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బాలకిషన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు పాల్గొన్నారు.

సకాలంలో మహిళా శక్తి లక్ష్యాలను సాధించాలి

- వంద శాతం యూనిట్స్ గ్రౌండింగ్ పూర్తిచేయాలి
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 28: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళా శక్తి కార్యక్రమంలోని 13 రకాల యూనిట్ల గ్రౌండింగ్ ఈ నెలాఖరులోగా 100శాతం పూర్తయ్యేలా అధికారులు కృషి చేయాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి స్పష్టం చేశారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి శాఖల అధికారులు, డీపీఏంలు, ఏపీఏంలతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో భాగంగా స్కూల్ యూనిఫామ్స్ కుట్టుపని, స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం 13 రకాల పథకాలను తీసుకొచ్చిందన్నారు. మదర్ ఫ్రొట్టీ ఫామ్ యూనిట్ లక్ష్యాన్ని వచ్చేనెల మొదటి వారంలోగా నెరవేర్చాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోలేని ఏపీఏంలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డీఆర్డీవో పీడీని ఆదేశించారు. మహిళా శక్తి రుణాల కోసం కలెక్టరేట్‌కు ఎవరూ రాకుండా క్షేత్ర స్థాయిలోనే పరిష్కరించాలని సూచించారు. ప్రతి వార్డులో పారిశుధ్య నిర్వహణకు ముగ్గురు సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్డీవో జ్యోతి, మెప్మా పీడీ గీత, జిల్లాలోని గ్రామీణాభివృద్ధి శాఖ డీపీఏంలు, ఏపీఏంలు, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ ఎంపీ, పక్కన సిద్దిపేట కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులు

పథకాలను పక్కాగా అమలు చేయాలి

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 28: ప్రభుత్వ పథకాలను పక్కాగా అమలు చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అధికారులను ఆదేశించారు. బుధవారం సిద్దిపేట కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి కోఆర్డినేషన్ మానిటరింగ్ సమావేశాన్ని ఎంపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈజీఎస్ పథకం అమలు, చేపట్టిన పనులు, కూలీలకు వేతనాల చెల్లింపులపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈజీఎస్‌లో 80 నూతన భవనాలు నిర్మించామని, మిగతా భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. సెప్టెంబర్ 19 వరకు నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. ఇప్పటివరకు జిల్లాలో 12.50 లక్షల మొక్కలు నాటగా అందులో 92శాతం మొక్కలు బతికాయని, అవసరమైన చోట నాటే ప్రక్రియ కొనసాగుతున్నదని అధికారులు తెలుపగా, పదేండ్లుగా నాటిన మొక్కల వివరాలు అందించాలని అధికారులను ఆదేశించారు. మొక్కలు నాటడం మీద శ్రద్ధపెడుతున్నారు కానీ, వాటి పర్యవేక్షణ పట్టించుకోవడం లేన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల గురించి అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు చేసే క్రమంలో తూకం విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, రైస్ మిల్లులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి మిల్లర్లకు లాభం చేకూర్చే విధంగా కాకుండా రైతులకు న్యాయం జరిగేలా పనిచేయాలన్నారు. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో ఇప్పటి వరకు ఎన్ని డబుల్ బెడ్ రూమ్‌లు పేదలకు అందజేశారు, ఎంత మందికి పట్టా లు ఇచ్చారని అధికారులను ప్రశ్నించగా పూర్తి వివరాలు వచ్చే సమావేశంలో అందజేస్తామని తెలిపారు. ప్రైవేట్ దవాఖానలను తనిఖీ చేయాలని ఆయన అధికారులకు సూచించారు. జిల్లాలో రెండు కొత్తగా బ్లడ్ బ్యాంకుల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, గరిమా అగర్వాల్, అన్ని ప్రభుత్వ శాఖల సిద్దిపేట జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ గ్రంథాలయంలో ప్రొఫెసర్ రియాజ్‌ను సన్మానిస్తున్న అధికారులు

గ్రంథాలయాలను విజ్ఞాన కేంద్రాలుగా మారుస్తాం

రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ప్రొఫెసర్ రియాజ్

హుస్నాబాద్, ఆగస్టు 28: గ్రంథాలయాలను విజ్ఞాన కేంద్రాలుగా మారుస్తామని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ప్రొఫెసర్ రియాజ్ అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని శాఖ గ్రంథాలయాన్ని ఆయన సందర్శించారు. అక్కడి సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. కొత్తగా నిర్మాణమవుతున్న గ్రంథాలయ భవనాన్ని సందర్శించి భవనం పూర్తికావడానికి కావాల్సిన నిధులపై ఆరా తీశారు. అనంతరం మంత్రి క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ సమాజాన్ని జ్ఞాన సమాజంగా మార్చాలని ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. హుస్నాబాద్‌లోని గ్రంథాలయాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ సహాయంతో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మెట్రోపాలిటన్ సిటీల్లో ఉండే విధంగా సకల పుస్తకాలను అందుబాటులో ఉంచడంతో పాటు ఆన్‌లైన్‌లో కూడా సమాచారం అందుకునేలా ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌కు అనుగుణంగా పోటీ పరీక్షలకు యువత సన్నద్ధమయ్యేలా స్టడీ మెటీరియల్‌ను అందిస్తామన్నారు. నిరుద్యోగ యువతతోపాటు విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. అంతకుముందు అధికారులు, సిబ్బంది, క్యాంపు కార్యాలయంలో నాయకులు రియాజ్‌ను సన్మానించారు.

సిద్దిపేట శ్రీనగర్ కాలనీ కాల్వలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు

పారిశుధ్యం పడకేసింది..

బీఆర్ఎస్ హయాంలో సిద్దిపేట పట్టణం పరిశుభ్రతతో అలరారింది. ప్రస్తుతం పట్టణం కంపుకొడుతున్నది. అధికార యంత్రాంగం నిర్లక్ష్యంతో డ్రైనేజీలు చెత్తాచెదారంతో నిండి దుర్గంధం వెదజల్లుతున్నాయి. పట్టణంలో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతున్నది. డ్రైనేజీలు పిచ్చిమొక్కలతో నిండి దోమలు, ఈగలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పారిశుధ్యం పడకేయడంతో ప్రజలు రోగాల బారినపడి, దవాఖానల చుట్టూ తిరుగుతున్నారు.

– సిద్దిపేట స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆగస్టు 28

సిద్దిపేట కోమటిచెరువు నుంచి వచ్చే కాల్వలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం

ఎస్‌జీఎఫ్ క్రీడల ప్రారంభం వివాదాస్పదం

పటాన్‌చెరు, ఆగస్టు 28: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండల స్థాయి 68వ ఎస్‌జీఎఫ్ క్రీడలను మున్సిపల్ చైర్మన్ కుమారుడు, కాంగ్రెస్ నాయకుడు రుష్వంత్‌రెడ్డి బుధవారం జడ్పీహెచ్ఎస్‌లో ప్రారంభించడంపై విమర్శలు వస్తున్నాయి. ఏ ప్రొటోకాల్ లేని మున్సిపల్ చైర్మన్ పుత్రరత్నం మండల క్రీడలను ప్రారంభించడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మండల విద్యాధికారి పీపీ రాథోడ్‌తో పాటు పీఈటీలు వేదికపై ఉండగా ఆయన క్రీడలను ప్రారంభించారు. పైగా అధికారులు ఆయన్ను వేదికపైనే ఘనంగా సన్మానించారు. క్రీడాకారులతో పరిచయాలు చేశారు. మున్సిపల్ చైర్మన్, కార్పొరేటర్లు, అధికారులు ఉండగా కాంగ్రెస్ యువ నాయకుడితో కార్యక్రమం నిర్వహించడం వివాదాస్పదమవుతున్నది. ఈ విషయంపై ఎంఈవో పీపీరాథోడ్‌ను నమస్తే తెలంగాణ వివరణ కోరగా రుష్వంత్‌రెడ్డి వేదికపైకి ఆఖరున రావడం జరిగిందన్నారు. కార్యక్రమం చివరలో ఆయన వచ్చారని, ఇది అధికారిక కార్యక్రమమని ధ్రువీకరించారు.

ఫ్లెక్సీలో మంత్రి ఫొటో లేదని ఆగ్రహం

పటాన్‌చెరు పట్టణంలోని మైత్రి మైదానంలో ప్రారంభించిన మండల స్థాయి క్రీడా ఉత్సవాల్లో భాగంగా ఫ్లెక్సీ వివాదం చెలరేగింది. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి క్రీడాజ్యోతిని వెలిగించి 68వ ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడలను ప్రారంభించారు. వేదికపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ ఫొటో లేదని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి విలేకరుల ముందు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ పాటించడంలో మండల విద్యాశాఖ, పీఈటీలు విఫలమయ్యారని ఆయన ఆరోపించారు.

మున్సిపల్ చైర్మన్ కుమారుడు రుష్వంత్‌రెడ్డిని సన్మానిస్తున్న అధికారులు, పీఈటీలు

అనాథ పిల్లలను ఆదుకుంటాం

దంతెపల్లిలోని అనాథ పిల్లల ఇంటికెళ్లి విచారణ చేస్తున్న శిశుసంక్షేమ శాఖ అధికారులు

రామాయంపేట, ఆగస్టు 28: అనాథ పిల్లలను ప్రభుత్వం తరపున ఆదుకుంటామని మెదక్ జిల్లా శిశు సంక్షేమ శాఖ బృందం సభ్యుడు మధుకర్ అన్నారు. బుధవారం మెదక్ జిల్లా రామాయంపేట మండలంలోని దంతెపల్లికి చేరుకున్న బృందం గిరిజనతండాకు వెళ్లి అనాథలైన ఇద్దరు చిన్నారులను కలిసి వారి క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు రోజుల క్రితం 'నమస్తే తెలంగాణ' దిన పత్రికలో వచ్చిన కథనానికి కలెక్టర్ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. చిన్నారులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. ఇద్దరు చిన్నారులను గురువారం జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కార్యాలయానికి రావాలని సూ చించినట్లు ఆయన తెలిపారు. కమిటీ నిర్ణ యం మేరకు ఆశ్రయం కల్పిస్తామన్నారు.

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

ఒకవైపు మందుల కొరత..మరో వైపు బడుల మూత

సంగారెడ్డి, ఆగస్టు 28: జిల్లాలోని ప్రభుత్వ దవాఖానల్లో మందులు దొరకక రోగులు అవస్థలు, మరో వైపు ఉపాధ్యాయులు లేక బడులు మూతపడే పరిస్థితి వచ్చిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. బుధవారం సంగారెడ్డిలో ఆయన మాట్లాడుతూ వానకాలం మొదలైనప్పటికీ పారిశుధ్య నిర్వహణకు చర్యలు తీసుకోకపోవడంతో పల్లెలు, పట్టణాల్లో దోమల వల్ల ప్రజలు మలేరియా, డెంగీ వంటి రోగాలబారిన పడుతున్నారన్నారు. జిల్లా కేంద్ర దవాఖానతో పాటు ప్రాంతీయ దవాఖానలు, ఆరోగ్యకేంద్రాల్లో మందుల కొరత ఉండడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. మండలానికి ఇంటర్నేషన్ పాఠశాల ఏర్పాటు చేస్తామని సీఎం మ్యానిఫెస్టోలో చెప్పి మర్చిపోయారని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలు మూసివేసే విధంగా చేస్తున్నారని విమర్శించారు. ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకుండా, విద్యా వలంటీర్లను నియమించకుండా చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. జిల్లాలో 1,111 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే బోధన ఎలా కొనసాగుతుందో పాలకులే చెప్పాలన్నారు. సమావేశంలో బుచ్చిరెడ్డి, నరహరిరెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా